క్లుప్తంగా

వడ్డీ రహిత బ్యాంకు ఏర్పాటు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని వడ్డీ రహిత బ్యాంకును ఏర్పాటు చేస్తున్నామని హ్యూమన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ఇక్బాల్ హుస్సేన్ తెలిపారు. ఆదివారం స్థానిక ఆజాద్ ఫంక్షన్ హాల్‌లో వడ్డీ రహిత బ్యాంకు, రుణాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వడ్డీ లేని సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని పలు నగరాల్లో వడ్డీ రహిత బ్యాంకులను ఏర్పాటు చేశామన్నారు. పేదలకు రుణాలను అందించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతోందన్నారు.

'ఎస్ఎస్‌బీఎన్' విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

రాప్తాడురూరల్: నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–1,2 విభాగాల ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ చేశారు. నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి ఏడోతేదీ వరకు నిర్వహిస్తున్న ×జల సంరక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ఎన్ఎస్ఎస్ అధికారులు నగరూరు రసూల్, రమాదేవి మాట్లాడారు. ×జల సంరక్షణ జన సంరక్షణ ।నీటిని సంరక్షిద్దాం కరువును తరిమికొడదాం॰ ×జలంతోనే జనం.. లేకుంటే లేదు జీవనం॰ అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో వలంటీర్లు సాంబశివుడు ,అశోక్, రవి, కార్తికేయ, శివ, నవీన్, ఆసిఫ్, జ్ఞానేష్, మైత్రి, సుష్మ, భవ్య శ్రీ, ప్రత్యూష పాల్గొన్నారు.

పంపనూరులో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. రాహుకేతు హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మంజునాథ స్వామి, పార్వతిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మహామంగళ హారతి అందించారు. భక్తులకు అన్నదానం చేశారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన



ఐ క్యాంపులో పాల్గొన్న లయన్స్ క్లబ్ సభ్యులు, రోగులు, వైద్యులు

అనంతపురం కల్చరల్: లయన్స్‌క్లబ్ అనంతపురం మెయిన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. స్థానిక గిల్డ్ ఆఫ్ సర్వీసు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన వందలాది మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, నబీరసూల్, అసిఫుద్దీన్, షరీఫ్, ఉమామహేశ్వరి తదితరులు మాట్లాడారు. 175 మందికి ఉచిత ఆపరేషన్లు చేయించడానికి బెంగళూరు నేత్రాలయకు పంపుతున్నట్లు తెలిపారు.

మలహోబిలేశుడి గరుడోత్సవం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

ఆత్మకూరు: పంపనూరు కొండపై వెలసిన మలోబిల లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గరుడోత్సవం నిర్వహించారు.

లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కల్యాణోత్సవం ఉంటుందని ఆలయ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. రాత్రి కొండపై స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

అనంతపురం క్రైం: రానున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని గెలిపించాలని మేయర్ వసీం కోరారు. ఆదివారం 38వ డివిజన్ కోవూర్‌నగర్‌లో ప్రతి ఓటరునూ మేయర్ కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీలో ప్రజలు పడిన ఇబ్బందులు, వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని ఆయన తెలియజేశారు. నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను తెలియజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు చింతకుంట మధు, ఖాజా, రియాజ్, సాయి, శర్మాస్, తదితరులు పాల్గొన్నారు. నగరంలోని 34, 46వ డివిజన్లలో కార్పొరేటర్లు మునగల రమాదేవి, ఎం.రాజేశ్వరి, డివిజన్ కన్వీనర్ నిహార్ రెడ్డి ప్రచారం చేశారు.డివిజన్‌లోని ఓటర్లకు అభ్యర్థుల బ్యాలెట్ నమూనాలు అందించారు. 25వ డివిజన్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్ పీరా ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నాయకులు శివయ్య, సుప్రజ, నాగేంద్ర, మధుసూదన్, చెన్నకృష్ణా రెడ్డి, విజయసింహారెడ్డి, రాజారెడ్డి, గంగిరెడ్డి, సోము, రఫి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ కాలనీలో ప్రచారం చేస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి



38వ డివిజన్ కోవూర్ నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మేయర్ వసీం



34వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ రమాదేవి, డివిజన్ కన్వీనర్ నిహార్‌రెడ్డి

డిప్యూటీ మేయర్ ప్రచారం

నగరంలోని రామచంద్రనగర్, రెవెన్యూ కాలనీల్లో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జనార్దన్‌రెడ్డి, ముని, ప్రీతమ్‌రెడ్డి, చింటు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిద్దాం

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిద్దామని పార్టీ మండల నాయకులు కోరారు. ఆదివారం తలుపూరు, వడ్డుపల్లిలో ఉన్న పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పార్వతమ్మ, సర్పంచ్‌లు లక్ష్మీనారాయణరెడ్డి, ఓబులేష్, ఎంపీటీసీ ఓబులేస్ ,వైఎస్సార్‌సీపీ నాయకులు బాలపోతన్న, ఈతికిరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వెన్నపూసకే మొదటి ప్రాధాన్యత ఓటు

కనగానపల్లి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికే మొదటి ప్రాధాన్యత ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో వెన్నపూస రవీంద్రారెడ్డి తరపున నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. బ్యాలెట్ నమూనా పత్రాలను ఓటర్లకు అందజేసి, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డైరెక్టర్ ప్రభాకర్, పాపన్న, అంకే రామకృష్ణ, అశోక్, పోతలయ్య, గోపాల్, హరి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్‌సీపీ తరుపున పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలపించాలని ఎంపీపీ అంజలి జెడ్పీటీసీ గోవిందరెడ్డి ఓటర్లను కోరారు. ఆదివారం బసంపల్లి, కనుముక్కల, నరసింగరాయునిపల్లి, చిన్నపరెడ్డిపల్లి, గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు డోలా రామచంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, సర్పంచ్‌లు జయరామిరెడ్డి, నారాయణ స్వామి, ఎంపీటీసీలు పవన్ కుమార్ రెడ్డి, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు..అండగా ఉంటాం

రాప్తాడు: అధైర్యపడొద్దు..అండగా ఉంటామని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి భరోసా కల్పించారు. ఈ నెల 2న గంగలకుంటకు చెందిన కపాడం పూజారి పోతులయ్య విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. గ్రామానికి ఎమ్మెల్యే చేరుకొని పూజారి పోతులయ్య కుటుంబ సభ్యులు రత్నమ్మ, కపాడం ఈశ్వరయ్య, నరేష్‌ను పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ మీకు ఏ సమస్య వచ్చినా నేనున్నాను, వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, డీలర్ రామలింగమయ్య, నాయకులు సాకే చంద్ర, జయన్న, మన్నల రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పూజారి పోతులయ్య కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

దేవదాయ భూమిలో ఆక్రమణల తొలగింపు

గార్లదిన్నె/అనంతపురం కల్చరల్: గార్లదిన్నె సమీపంలోని కల్లూరు అగ్రహారంలో దేవదాయశాఖ భూమిలో ఆక్రమణలను ఎండోమెంట్ అధికారులు ఆదివారం తొలగించారు. ఎండోమెంటు అధికారులు పోలీసు బలగాలతో అక్కడికి చేరుకొని ఆక్రమణలు తొలగించడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కల్లూరు అగ్రహారంలో సర్వే నంబర్ 259లో 7.71 ఎకరాల భూమిలో ఇటీవల కొందరు జెండాలు పాతి, తాత్కాలికంగా గుడిసెలు వేసుకున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ రామాంజనేయులు, ఈఓ బాబు పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారుల సహాయంతో వాటి తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. ఇతర ఆలయాల ఈవోలు రామాంజనేయులు, రమేష్‌తో పాటు తొండపాడు అర్చకులు ఆక్రమణ ప్రదేశానికి చేరుకొని మద్దతు తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఎండోమెంట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏసీ రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాలని ఈవోలకు సూచించారు.



పుష్పగిరి పీఠానికి చెందిన కల్లూరు అగ్రహారం భూములు

ప్రయాణం..భయం భయం

ఆత్మకూరు: ఆత్మకూరు బైపాస్‌లో ప్రయాణం అంటే వాహనదారులు, స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎటు వైపు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియక భయం భయంగా వాహనాలు నడపాల్సి వస్తోంది. హైవేపై మితిమీరిన వేగంతో వాహనాలు వస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆత్మకూరు ఊరి బయట బైపాస్ రోడ్డు వెళ్లడంతో కార్లు, భారీ వాహనాలు అతివేగంతో వెళ్తున్నాయి. ఆత్మకూరు నుంచి బైపాస్ రోడ్డు వెంట మూడు కిలో మీటర్లు ప్రమాదకరంగా ఉంది. ఆత్మకూరు నుంచి పి.యాలేరు, కూడేరు, సిద్ధరాంపురం వెళ్లాలన్నా బైపాస్ దాటాల్సి వస్తోంది. ఈ కూడళ్లలో ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి. దాదాపు ఆరుగురు ప్రమాదాలకు గురై మృత్యువాతపడ్డారు. ఆత్మకూరు బైపాస్ మీదుగా వడ్డుపల్లి వరకు ప్రమాద సూచికలు ఏర్పాటు చేశారు. కానీ వాహనదారులు వాటిని లెక్కచేయడంలేదు. ఇప్పటి వరకు ద్విచక్ర వాహనదారులు ఎక్కువ మంది మృత్యువాత పడ్డారు. పోలీసులు రోడ్డు నిబంధనలు తెలియజేస్తూ, లైసెన్సులు, హెల్మెట్లులేని వారికి జరిమానాలు విధిస్తున్నా వాహనదారులు లెక్కచేయడంలేదు. అతివేగంతో వెళ్తూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారని స్థానిక ప్రజలు అంటున్నారు.



హైవేపై పోలీసులు ఏర్పాటు చేసిన డ్రమ్ములను ఢీకొని వెళ్లిన వాహనదారులు

రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం


తాడిపత్రి టౌన్: రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయమని తహసీల్దార్ మునివేలు తెలిపారు. స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 55 మంది దివ్యాంగులకు నిత్యావసర వస్తువుల కిట్స్‌ను తహసీల్దార్ మునివేలు, క్లబ్ సభ్యులు పంపిణీ చేశారు. అనంతరం తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ పేద దివ్యాంగుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కొన్నేళ్లుగా రోటరీ క్లబ్ సభ్యులు దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తుండటం అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు షాకీర్ , కార్యదర్శి కిషోర్, సభ్యులు నాగేంద్ర, రామయ్య, మద్దిలేటి, బాబు, మాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నాగలింగేశ్వర స్వామి ఉత్సవం

బుక్కరాయసముద్రం: నీలంపల్లి గ్రామంలో నాగలింగేశ్వరుడి ఉత్సవాలు సోమ, మంగళవారం నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం ఆలయంలో నాగలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరగనున్నాయి. అదేరోజు రాత్రి 10 గంటల నుంచి 1.30 గంటల వరకు గణపతి పూజ, పుణ్యాహ వచనం, మహా మంగళ హారతి, ప్రాకార సంప్రోక్షణ, రాత్రి 12 గంటలకు స్వామి వారి రథోత్సవాన్ని గ్రామంలో ఊరేగించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుంది. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు ఆలయంలో అన్నదానం ఉంటుంది. రాత్రి 11.50 గంటల నుంచి 2.30 గంటల వరకు అంకా దహనం ఉంటుంది.

మితిమీరిన ఆకతాయిల ఆగడాలు

రాయదుర్గం: పట్టణంలోని కణేకల్లు రోడ్డు, గాడలేబౌట్, రైల్వేస్టేషన్, జూనియర్ కళాశాల మైదానం పరిసరాల్లో ఆకతాయిల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. మద్యానికి బానిసైన యువకులు జనసంచారం లేని ప్రాంతాలను ఆవాసం చేసుకుని పెట్రేగిపోతున్నారు. తొమ్మిదో తరగతి చదివే కొందరు విద్యార్థులు ఇటీవల గంజాయి సిగరెట్లు, మద్యం తాగుతూ సమీప నివాస గృహాల వారికి పట్టుబడ్డారు. మంచి పద్ధతి కాదని హెచ్చరించిన వారి ఇళ్లను టార్గెట్ చేస్తూ దాడులకు తెగబడుతున్నారు. రెండు రోజుల క్రితం తమ ఆగడాలకు అడ్డుచెపుతున్నారనే ఆక్రోశంతో రామాంజనేయులు అనే వ్యక్తి ఇంటిని లక్ష్యం చేసుకుని రాళ్లు, మద్యం బాటిళ్లను విసిరారు. ఆ శబ్దానికి తలుపులు తీసేందుకు సైతం వణికిపోయారు. ఆకతాయిల ఆగడాపై చాలా మంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గస్తీ నిర్వహించాల్సిన పోలీసులు పట్టించుకోవడం లేదు. అర్బన్ పీఎస్‌లో ఇలాంటి ఫిర్యాదులకు దిక్కులేకుండా పోతుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరాచ గ్యాంగ్‌లను ముందే పసిగట్టి కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



గాడ లేబౌట్ వద్ద ఓ ఇంటి ఆవరణలోకి విసిరిన బీరు సీసాలు

సారూ.. ఆహ్లాదాన్ని పంచరూ!





రాంనగర్ సిద్ధార్థ పార్కులో గుట్టలుగా పేరుకుపోయిన చెత్తా చెదారం, వృథాగా పడి ఉన్న పూలకుండీలు

అనంతపురం క్రైం: ప్రభుత్వం నగర ప్రజల ఆటవిడుపు కోసం, ఆహ్లాదం అందించేందుకు పార్కుల అభివృద్ధి చేస్తుంటే.. మరోవైపు నగరపాలక సంస్థ అధికారులు పార్కుల నిర్వహణ పట్టించుకోవడం లేదు. ఇందుకు నిదర్శనం స్థానిక రాంనగర్‌లోని సిద్ధార్థ పార్క్. ఇందులో ఆట వస్తువులు ఉన్నాయి. సౌకర్యాలు ఉన్నాయి. అయితే పార్కు నిర్వహణను పట్టించుకోకపోవడంతో చెత్త గుట్టలుగా పడింది. పూలకుండీలున్నా, మొక్కల పెంపకం చేపట్టలేదు. హౌసింగ్ బోర్డు పార్క్‌లోని మొక్కలనైనా తీసుకొచ్చి ఇక్కడ నాటితే పార్క్ ఆహ్లాదంగా ఉంటుందని, స్థానికులు చెప్తున్నారు.

అధికారుల్లో కొరవడిన 'చెత్త'శుద్ధి

- సిబ్బంది నిర్లక్ష్యం
- అధికారుల పర్యవేక్షణ లోపం
- నీరుగారుతున్న 'క్లాప్' ఆశయం

అనంతపురం క్రైం: ఇంటింటా తడిచెత్త.. పొడిచెత్త వేరు చేసి ఇస్తే సిబ్బంది మాత్రం ఆటోలోకి కలిపేస్తున్నారు. చెత్తను వేరు చేయకుండానే డంపింగ్ యార్డ్‌కు తరలించేస్తున్నారు. చెత్త నిర్వహణపై నగరపాలక సంస్థ అధికారులకు ఏపాటి 'చెత్త'శుద్ధి ఉందో తేటతెల్లమవుతోంది. చెత్త రహిత నగరమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కార్యక్రమంలో భాగంగా ఆటోల ద్వారా ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఏజెన్సీ నిర్వాహకుల బాధ్యతారాహిత్యంతోపాటు నగరపాలక సంస్థ ప్రజారోగ్యాధికారుల పర్యవేక్షణ లోపించింది. దీంతో చెత్తను వేరు చేయకుండానే కంపోస్టు యార్డుకు తరలిస్తున్నారు. చెత్తను వేరు చేసేందుకు నగరపాలక సంస్థ డబ్బులు చెల్లిస్తోంది. తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరు చేసి ఇచ్చేలా ఇప్పటికే నగరపాలక సంస్థ అధికారులు నగరంలో 2 లక్షల వరకు గ్రీన్, బ్లూ, రెడ్ రంగుల డస్ట్‌బిన్లను ప్రజలకు అందించారు. అయినా ఏజెన్సీ నిర్వాహకులు చెత్త సేకరణను తూతూమంత్రంగా చేస్తున్నట్లు తెలుస్తోంది.

నగరంలో ఈ ఏడాది జూలై నుంచి క్లాప్ ఆటోల ద్వారా చెత్త సేకరణ కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. మొదట్లో 14 ఆటోలతో పలు సచివాలయాల పరిధిలో చెత్త సేకరించారు. ఇటీవల నగరపాలక సంస్థకు 33 ఆటోలు వచ్చాయి. దీంతో మొత్తం 47 ఆటోలతో నగరంలోని 50 సచివాలయాల్లో చెత్త సేకరించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఒక్కో ఆటో రోజూ 30 కిలోమీటర్లు తిరిగి చెత్త సేకరించాల్సి ఉంది. అందుకు ఏజెన్సీ నిర్వాహకులకు ఒక్కో ఆటోకు నగరపాలక సంస్థ రూ.62,750 చెల్లిస్తోంది. ఇప్పటి వరకు నగరపాలక సంస్థ ప్రతి నెలా రూ.8.27 లక్షల చొప్పున రూ.24 లక్షల (మూడు నెలలకు గానూ) వరకు ఏజెన్సీకి చెల్లించింది. ఏజెన్సీ నిర్వాహకులే ఆటోలు, చెత్త తీసుకెళ్లే సిబ్బంది ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రజలందించిన తడి, పొడి, ప్రమాదకర చెత్తలను వేరుగా తీసుకెళ్లాల్సిన బాధ్యత క్లాప్ ఆటో నిర్వాహకులదే. కానీ ఎంఓయూలో కుదుర్చుకున్న మార్గదర్శకాలను ఏమాత్రం పాటించడం లేదన్న విమర్శలులు వ్యక్తమవుతున్నాయి. ఆర్అండ్‌బీ అతిథి గృహం పక్కన ఉన్న చెత్త సేకరణ పాయింట్‌లో క్లాప్ ఆటోల ద్వారా తెచ్చిన చెత్తను కాంపాక్టర్లలో కుక్కి కంపోస్టు యార్డుకు పంపిస్తున్నారు. మళ్లీ కంపోస్టు యార్డులో తడి, పొడి, ప్రమాదకర చెత్తను బయోమైనింగ్ పద్ధతి ద్వారా వేరు చేయాల్సి వస్తోంది.



తడిచెత్త బాక్స్‌ను మూసివేసి పొడిచెత్త ఉన్న బాక్సులోనే మొత్తం చెత్తను తీసుకెళ్తున్న సిబ్బంది



ఆర్అండ్‌బీ కార్యాలయం పక్కన ఉన్న చెత్త సేకరణ పాయింట్‌లో కాంపాక్టర్‌లో కుక్కి, కంపోస్టు యార్డుకు తరలిస్తున్న దృశ్యం

చర్యలు తీసుకుంటాం

చెత్త నిర్వహణ పక్కాగా జరిగేలా చర్యలు తీసుకుంటాం. క్లాప్ ఆటో ఏజెన్సీ నిర్వాహకులు చెత్తను వేరుగా చేసి తీసుకెళ్లాలి. ఆ దిశగా వారికి ఎప్పటికప్పుడు సూచనలందించేలా పారిశుధ్య కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. ప్రజలు సైతం చెత్తను వేరు చేసి, నగరాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి.

– కే భాగ్యలక్ష్మి, కమిషనర్, నగరపాలక సంస్థ

పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

అనంతపురం క్రైం: ఇంటి, నీటి పన్ను వసూళ్ల మరింత వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశించారు. ఆదివారం కమిషనర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. ఈ నెల 31లోపు వందశాతం పన్ను వసూళ్లను చేపట్టాలన్నారు. మొండిబకాయిదారులను ఏమాత్రం ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రీసర్వేకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలన్నారు. క్లాప్ ఆటోల ద్వారా చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఆర్ఓలు సతీష్, సుజాత, ఆర్ఐలు వేణు, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు వెళ్లి పింఛన్ పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ హరిచంద్రన్, మాజీ సర్పంచు బండి శ్రీనివాసులు

రాప్తాడు: పాలచెర్ల మాజీ స్టోర్ డీలర్, టీడీపీ కార్యకర్త మంగళ గోపాల్ కేన్సర్‌తో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వెల్ఫేర్ అసిస్టెంట్ హరిచంద్రన్, మాజీ సర్పంచు బండి శ్రీనివాసులు ఆదివారం బెంగళూరు ఉంటున్న గోపాల్‌ను కలిసి పింఛన్ అందించారు.

10న ఉచిత వైద్యశిబిరం

చెన్నేకొత్తపల్లి: ఈనెల 10న ఓబుళంపల్లిలో సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం న్విహిస్తున్నట్లు సంస్థ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు స్థానిక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించనున్న వైద్యశిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు, మొబైల్ తెచ్చుకోవాలన్నారు.

కార్మికుల పక్షపాతి పెండ్యాల



నివాళులర్పిస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

అనంతపురం సెంట్రల్: స్థానిక ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకుడు, రాజీవ్‌రత్న అవార్డు గ్రహీత పెండ్యాల రామ్‌మోహన్‌రావు వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ రాష్ట్ర నాయకుడు భాస్కర్‌నాయుడు, జిల్లా కన్వీనర్ లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు వెంకటేసులు, రాజారావు, సీఎస్‌రెడ్డి, సాయిలీల, హేమలత, డీఎస్‌రెడ్డి, మనోజ్‌కుమార్, ఆర్ఎస్ వాసులు, సదాశివరెడ్డి, నాగభూషణం, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన



చేనేత హస్తకళా ప్రదర్శనలో వస్తువులు కొనుగోలు చేస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ఆదివారం సెలవు దినం కావడంతో చేనేత వస్తువులను కొనుగోలు చేసేందుకు నగర ప్రజలు ఎగబడ్డారు. కొండపల్లి బొమ్మలు, ఖాదీ షర్ట్స్, సహరన్‌పూర్ ఫర్నీచర్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, హైదరాబాద్ పెరల్స్, శారీస్, మైసూర్ పెయింటింగ్స్, ఫ్లవర్స్, ఇంటికి శోభనిచ్చే హస్తకళా బొమ్మలు, ఇలా వేలాది వెరైటీలను ప్రదర్శనలో ఉంచారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



గార్లదిన్నె: కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామికి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.